క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు

నంద్యాలఅర్బన్: నంద్యాల అర్బన్ తహసీల్దార్‌గా పత్తి శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. రూరల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను అర్బన్ మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూరల్‌కు రెగ్యులర్ తహసీల్దార్ వచ్చేంత వరకు తాను ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. పట్టణ, రూరల్ ప్రాంతాల ప్రజలు సహకరిస్తే నంద్యాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఆయనకు పలువురు అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి


ఇంజేడులో ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ: మండలంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. మంగళవారం మండలంలోని ఇంజేడు గ్రామంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. 10 మందికి ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేయడం జరిగిందన్నారు. మండల పరిధిలో మాయలూరు, సుద్దమల్ల, అల్లూరు, ఇంజేడు గ్రామాల్లో ఈ నెల 12వ తేదీ వరకు ఆధార్ కేంద్రాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత


వాటర్‌బాటిళ్లు, పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

నంద్యాల (వ్యవసాయం): నంద్యాల బొమ్మలసత్రంలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా మంగళవారం సాయిబాబా, సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 100 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్టీల్ వాటర్ బాటిల్స్, బాబాచిత్రపటాలను ఉచితంగా అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మధు మోహనరెడ్డి, శివనాగిరెడ్డి, లక్ష్మీదేవి, నాగేంద్ర, సాయి సేవకులు పాల్గొన్నారు.

బదిలీలను నిలిపివేయాలని నిరసన


నిరసన తెలుపుతున్న ఏపీ ఎన్జీఓ నాయకులు

నంద్యాల అర్బన్: అక్రమ బదిలీలను వెంటనే నిలిపివేసి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చేపట్టాలని ఏపీ ఎన్జీటీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మణిశేఖరరెడ్డి, కార్యదర్శి ఉసేన్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక తెలుగుగంగ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన పర్యవేక్షక ఇంజినీర్‌కు ఉద్యోగులపై అవగాహన లేమిని ఆసరాగా తీసుకుని కొందరు అక్రమ బదిలీలకు తెరలేపారన్నారు. అలాంటి బదిలీలను ఆపాకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. నర్సారెడ్డి, విజయరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గోవిందు, నారాయణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న సుబ్బరాయుడు

గోస్పాడు: ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆర్ఎస్‌పీ నంద్యాల జిల్లా కన్వీనర్ అప్పపోగు సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం గోస్పాడులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పేదవానికి ఇళ్ల స్థలం, సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం ఆర్ఎస్‌పీ గోస్పాడు మండల కన్వీనర్‌గా అమర్‌నాథ్ రెడ్డి, సభ్యులుగా నాగరాజు, సుబ్బయ్యను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు చెప్పారు.

దాడిచేసిన వారిని శిక్షించాలి

ఆళ్లగడ్డ: సాక్షి కార్యాలయాలపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గ సాక్షి విలేకరులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్‌సీ ఇన్‌చార్జ్ క్రిష్ణ, రిపోర్టర్లు చలపతిరెడ్డి, బాలమద్దిలేటి, హుసేన్‌సా, ఖాజారసూల్, తిరుమలేశ్ ఉన్నారు.

విద్యార్థులకు భరోసా అందేనా..?

- తల్లికి వందనం పేరు మార్పుతో సరిపెట్టిన కూటమి ప్రభుత్వం
- ప్రకటనలతో కాలయాపన
- 2024-25లో విద్యార్థులకు అందని పథకం
- పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా కరువు


తరగతి గదిలో విద్యార్థులు(ఫైల్)

గోస్పాడు: అధికారంలోకి వస్తే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఊదరగొట్టిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు ఒక్క హామీని అమలు చేయలేదు. పేదలకు ఫీజులు భారం కాకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ అమ్మ ఒడి పథకం అమలు చేసింది. తల్లి ఖాతాలో ఏటా రూ.15 వేలు జమచేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఈ పేరును తల్లికి వందనంగా మార్పు చేసింది తప్పితే ఇప్పటి వరకు చిల్లిగవ్వ ఇవ్వలేదు. ప్రకటనలతో కాలయాపన చేస్తోంది. గత విద్యా సంవత్సరం తల్లుల ఖాతాలో నగదు జమకాలేదు.

గత ప్రభుత్వంలో అండ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మఒడి పథకం లక్షలాది నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచింది. విద్యారంగ అభివృద్ధికి నాటి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన సంస్కరణలను తీసుకొచ్చారు. అందులో భాగంగా అమ్మ ఒడి, మనబడి, నాడు–నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, డిజిటల్ విద్య, జగనన్న విద్యాకానుక వంటి పథకాలు ఉన్నాయి. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వసతులు కల్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశారు. పేద, మధ్య తరగతి పిల్లల చదువులకు ఆర్థిక భరోసా కల్పించారు. పిల్లల చదువులపై ఆందోళనతో ఉన్న తల్లులకు ధైర్యాన్నిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం నాలుగేళ్లు అమ్మఒడిని పకడ్బందీగా అమలు చేశారు. ఈ పథకం కింద మండలంలో నాలుగేళ్లలో రూ 25.92 కోట్లు అందించారు. నేరుగా వారి విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాకు రూ.15 వేలు జమచేశారు.

2024–25లో ఎగవేత

అమ్మ ఒడి పథకం కింద నిధులు మంజూరు చేయాల్సి ఉండగా ఎన్నికలు వచ్చాయి. అప్పట్లో ప్రచారం సందర్భంగా కూటమి నేతలు సూపర్‌సిక్స్ పేరుతో పథకాలు అమలు చేస్తామని ప్రకటించారు. తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని ఊదరగొట్టారు. తీరా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా పథకం అమలు చేయలేదు. గత విద్యాక సంవత్సరం గడిచిపోయింది. మండలంలో గత ఏడాది విద్యార్థుల సంఖ్య 1 నుంచి పదో తరగతి వరకు 4024 కాగా, ఇంటర్‌లో 730 మంది విద్యార్థులకు ఈ పథకం కింద జమకావాల్సిన నిధులను కూటమి ప్రభుత్వం ఇవ్వకుడా మోసం చేసింది.

గోస్పాడు మండలంలో నాలుగేళ్లలో అమ్మ ఒడి పథకం ఇలా

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	జమ అయిన మొత్తం (రూ.కోట్లలో)
2020-21	4170	6.25
2021-22	3656	5.11
2022-23	5276	6.86
2023-24	5928	7.70

నాడు సంబరం.. నేడు విచారం

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, పేద పిల్లలు ఉన్నత చదువులకు దూరమవకూడదనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అధికారంలో వచ్చిన ఆరు నెలల్లోనే అమ్మ ఒడి పథకం అమలు చేసింది.. ఏటా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రూ.15 వేల నగదు వారి తల్లులు, సంరక్షుల ఖాతాల్లో జమ చేసింది. నాలుగేళ్ల పాటు ఖాతాల్లో నగదు జమ చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పట్లో సంబరం చేసుకున్నారు. ప్రస్తుతం తల్లికి వందనం పథకం కింద డబ్బులు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూడాల్సి వస్తోంది.

భారంగా మారింది



గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు అనే తేడా లేకుండా బడికి వెళ్లే విద్యార్థి తల్లి ఖాతాలో రూ.15 వేలు జమచేశారు. నాలుగేళ్ల పాటు అమ్మ ఒడి అమలు చేశారు. ఫీజుల భారం ఉండేది కాదు. దీనికి తోడు అనేక పథకాల ద్వారా పేదలు లబ్ధిపొందేవారు. ప్రస్తుత పరిస్థితి పూర్తిగా మారిపోయాయి. తల్లికి వందనం అన్నారు. ఇప్పటికే ఏడాది గడిచిపోయింది. ఒక దఫా ఎగొట్టారు. ఎప్పుడు అమలు చేస్తారో తెలియని పరిస్థితి. చదువు భారంగా మారింది. –నాగేశ్వరరెడ్డి , సాంబవరం

పేద విద్యార్థులకు వరంగా ఉండేది



అమ్మ ఒడి పథకం ద్వారా గత ప్రభుత్వంలో బ్యాంకు ఖాతాలో రూ. 15 వేలు జమ అయ్యేవి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు కింద ఎంతో అభివృద్ధి చేశారు. అన్ని వసతులు కల్పించారు. ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చదువు వ్యాపారంగా మారిన తరుణంలో పేద పిల్లలకు చదువు చెప్పించాలంటే భారమవుతోంది. – ఆర్థర్ సైమాన్, ఎంపీపీ, గోస్పాడు

చిరుధాన్యాల సాగు లాభదాయకం


మాట్లాడుతున్న శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు

గోస్పాడు: చిరుధాన్యాల సాగు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని, వాటిని వినియోగించే వారికి కూడా ఎంతో ఆరోగ్యకరంగా ఉంటుందని హైదరాబాద్‌కు చెందిన భారతీయ చిరుధాన్య పరిశోధన సంస్థ, శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం కింద గోస్పాడు మండలంలోని ఎం. కృష్ణాపురం, యాల్లూరు గ్రామాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రవి గౌడ్‌తో కలిసి మాట్లాడారు. వరి, మినుము పైర్లలో ఎరువుల వాడకాన్ని సిఫారసు మేరకు వాడి రసాయన ఎరువులపై ఖర్చు తగ్గించుకుని నికర ఆదాయం పెంచుకోవాలని సూచించారు. విత్తన శుద్ధి పాటించి పంట తొలిదశలో వచ్చే పురుగు తెగుళ్ల యాజమాన్యం చేపట్టవచ్చన్నారు. రైతులు కేవలం వ్యవసాయం మాత్రమే కాకుండా అనుబంధ రంగాలైన పశుపోషణ, ఉద్యానం వంటి వాటిపై దృష్టి సారించి అధిక ఆదాయం పొందాలన్నారు. ఖరీఫ్ ముందు చేపట్టాల్సిన సన్నద్ధత కార్యక్రమాలపై వివరించారు. భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం, విత్తనశుద్ధి, పంట మార్పిడి, అంతరపంటలు, చిరుధాన్యాల సాగు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను, అనుసరించే విధానాలపై వివరించారు. మొక్కజొన్న, కంది, వరి పంటల్లో సస్యరక్షణ చర్యలైన విత్తన శుద్ధి, తెగుళ్లు, పురుగు మందుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి స్వప్నికారెడ్డి వ్యవసాయశాఖ అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది హరిప్రసాద్, సురేష్ ,అహ్మద్, నాగార్జున పాల్గొన్నారు.

వ్యాపార కేంద్రాలుగా విద్యాలయాలు


ఎస్ఎఫ్ఐ విద్యార్థులతో వాగ్వివాదం చేస్తున్న పోలీసులు

నంద్యాల (న్యూటౌన్): పట్టణంలోని కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రాజా, ఎంఆర్ నాయక్ అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గుడ్‌షెపర్డ్ స్కూల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యను వ్యాపారం చేస్తున్నా విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వేలకు వేలు ఫీజులు దోపిడీ చేస్తున్నారని గుడ్‌షెపర్డ్ యాజమాన్యంతో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు చర్చించగా యాజమాన్యానికి, ఎస్ఎఫ్ఐ విద్యార్థుల మధ్య వాగ్వివాదం జరిగింది. పాఠశాల యాజమాన్యం పోలీసుల దృష్టికి తీసుకుపోగా విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపివేశారు. విద్యాహక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయుకులు సాయి, రోహిత్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ విజేతలకు సన్మానం


బాక్సింగ్‌లో ప్రతిభ చూపిన బాలబాలికలు

నంద్యాల(న్యూటౌన్): కోవెలకుంట్లలో ఈ నెల 8వ తేదీ నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ అలీ హుస్సేన్ నిర్వహణలో జరిగిన సబ్ జూనియర్ జిల్లా స్థాయి బాక్సింగ్ టోర్నమెంట్‌లో నంద్యాల పట్టణానికి చెందిన 11 మంది బాలలు పతకాలు సాధించారు. మంజునాథ్, చిన్నలా గోల్డ్ మెడల్స్ సాధించగా, శశిధర్‌రెడ్డి, తన్వీర్, ప్రణీత్, ప్రణతి సాయి సిల్వర్ మెడల్స్ సాధించారు. అజయ్ రాజు, నవనీత్, మణికంఠ, మహీధర్ బ్రాంజ్ మెడల్స్ అందుకున్నారు. మంగళవారం స్థానిక క్రీడా సమాఖ్య కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కర్నూలు ఉమ్మడి జిల్లా ఒలింపిక్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ విజేతలకు జ్ఞాపికలు అందించి అభినందించారు. క్రీడల్లో నిరంతర సాధన విజయానికి కీలకమన్నారు. రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించి నంద్యాల జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. నంద్యాల జిల్లాలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహబూబ్ బాషా, ఫయాజుద్దీన్‌లకు బాక్సింగ్ క్రీడా అభివృద్ధికి సహకరిస్తామన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నిజాముద్దీన్, శిరిగిరి రమేష్, కోచ్‌లు సర్దార్, షానవాజ్ ఖాన్, రమణయ్య, డీసీపీ శర్మ, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ప్రత్యేక పూజలు


స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోకకల్యాణం కోసం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. మంగళవారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

ఊయలసేవ

శ్రీశైల భ్రమరాంబాదేవికి మంగళవారం పౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం , సహస్రనామ పూజలు జరిపించారు.

భ్రామరీకి లక్ష కుంకుమార్చన

శ్రీశైల భ్రమరాంబాదేవికి మంగళవారం పౌర్ణమి ఘడియలు ప్రారంభమవడంతో సాయంత్రం లక్ష కుంకుమార్చన సేవను శాస్త్రోక్తంగా జరిపించారు. శ్రీశైలానికి రాలేని ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర చెందిన 18 మంది భక్తులు పరోక్షసేవ ద్వారా లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నారు. అర్చకులు ముందుగా పూజాసంకల్పం పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజను జరిపి శాస్త్రోక్తంగా లక్షకుంకుమార్చన సేవను జరిపించారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బ యలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం సందర్భంగా శాస్త్రోక్తంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చన నిర్వహించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

కొణిదెల గ్రామాభివృద్ధికి రూ.50 లక్షలు

నంద్యాల (న్యూటౌన్): నందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తన సొంత నిధుల నుంచి రూ. 50 లక్షలను మంజూరు చేసినట్లు కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం నంద్యాల కలెక్టరేట్‌లో చెక్కును అందజేశారు. నిధులను గ్రామ అభివృద్ధి పనులకు వినియోగించాలని సూచించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా యంత్రాంగం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. ఓహెచ్ఆర్ ట్యాంకు, రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. డీఆర్ఓ రాము నాయక్, ఏఓ రవికుమార్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దూదేకుల సంఘం కృషి


నగుదు బహుమతులు అందుకున్న విద్యార్థులతో దాతలు, సంఘం నాయకులు

చాగలమర్రి: దూదేకుల సామాజికవర్గ పిల్లల విద్యాభివృద్ధికి దూదేకుల నూర్‌బాషా సంక్షేమ సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు, వాసవీ పాఠశాల కరస్పాండెంట్ దస్తగిరి అన్నారు. మంగళవారం శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాబన్‌తో కలిసి పదిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పదిలో 571 మార్కులు సాధించిన పెనుగొండ షఫివుల్లాకు రూ.5వేలు, కుమ్మరిపల్లె సింధూరికి(565) రూ.4వేలు, డి.యశ్వంత్(540)కు రూ.3వేలు, కె.బీబీకి రూ.2వేలు, పి.హుసేన్‌బీకి రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులను అందజేశారు. బ్రహ్మయ్య, దాతలు పాపయ్య, ఇమామ్, రంగయ్య, దస్తగిరి, ఖాశీం, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నందవరం ఏసీగా శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానంది దేవస్థానం ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డిని నందవరం చౌడేశ్వరి దేవస్థానం రెగ్యులర్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లా పొన్నూరు భావనారాయణస్వామి ఆలయంలో రెగ్యులర్ ఏసీగా చేస్తున్న ఆయన మహానంది ఈఓ(ఎఫ్ఏసీ)గా ఉన్న విషయం తెలిసిందే. నందవరం రెగ్యులర్ ఏసీతో పాటు మహానంది ఈఓగా కొనసాగనున్నారు.

- కసాపురం దేవస్థానంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ పి.వెంకటనారాయణ మహానంది ఆలయానికి బదిలీ అయ్యారు.

శ్రీశైల దేవస్థానం ఉద్యోగుల బదిలీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు రెగ్యులర్ ఉద్యోగులను ఇతర దేవస్థానాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైల దేవస్థానంలో సహాయ కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఐఎన్‌వీ మోహన్‌ను శ్రీకాళహస్తి దేవస్థానానికి, బీవీ శివారెడ్డి(అసిస్టెంట్ ఇంజినీర్), కె.గిరిజామణి (పర్యవేక్షకులు), డి.సదాశివరావు(సీనియర్ అసిస్టెంట్), ఎస్.అనురాధ(సీనియర్ అసిస్టెంట్), వీవీఎస్ గణపతి(జూనియర్ అసిస్టెంట్), వి.లక్ష్మీనారాయణ(జూనియర్ అసిస్టెంట్)లను మహానంది దేవస్థానానికి, ఎం.పోలేశ్వరరావు (జూనియర్ అసిస్టెంట్) ఆర్ఎస్.రంగాపురం సమీపంలోని మద్దిలేటి నరసింహస్వామి దేవస్థానానికి, హెచ్.మంజునాథ్(జూనియర్ అసిస్టెంట్) కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి, టీ.ఏడుకొండలు (జూనియర్ అసిస్టెంట్) శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు.

ఇతర దేవస్థానాల నుంచి ఇద్దరు ఏఈఓ, ఇద్దరు పర్యవేక్షకులు శ్రీశైల దేవస్థానానికి బదిలీ అయినట్లు సమాచారం.

బాల్య వివాహాలను నివారిద్దాం




ప్రమాణం చేయిస్తున్న సీడీపీఓ చంద్రకళ, చెంచుగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

నంద్యాల అర్బన్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ లీలావతి, నంద్యాల అర్బర్ సీడీపీఓ చంద్రకళ తెలిపారు. స్థానిక భరతమాత దేవాలయం ఆవరణలో కిశోర బాలికల తల్లిదండ్రులతో సామాజిక వ్యవస్థలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్న వయసులో పెళ్లిళ్లు చేసి బాలికల జీవితాన్ని నాశనం చేయవద్దని కోరారు. బాగా చదివించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని.. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

బాల్య వివాహలతో అనేక అనర్థాలు

రుద్రవరం: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, చిన్నతనంలో వివాహాలు చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు వస్తాయని ఐజీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని కోటకొండ పంచాయతీ మజరా అయిన చిన్నయ్యస్వామి చెంచుగూడెంలో బాలికలు, వారి తల్లులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, చట్టాలు, ఆహారం, విద్య, బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. చెంచుగూడెంను బాల్య వివాహాల రహిత గ్రామంగా మార్చాలని గూడెం వాసులకు సూచించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గూడెంలో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

దొర్నిపాడు: బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ అన్నారు. మంగళవారం దొర్నిపాడులో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బాలికల సంరక్షణ కోసం పోక్సో వంటి చట్టాలు ఉన్నాయని తెలిపారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుబ్బమ్మ, తులసమ్మ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

కిశోరి వికాసమే సమాజ వికాసం

శిరివెళ్ల: కిశోరి వికాసమే సమాజ వికాసమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి అన్నారు. మంగళవారం 1వ గ్రామ సచివాలయంలో కిశోరి వికాసం ముగింపు సభ జరిగింది. నెలకుపైగా జరిగిన కార్యక్రమంలో 15 నుంచి 19 ఏళ్ల బాలికలకు ఆరోగ్యం, విద్యపై అవగాహన కల్పించామని తెలిపారు. పురుషులకు 21 ఏళ్లు, మహిళలకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలని తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహ రహిత జిల్లాగా నంద్యాలను తీర్చిదిద్దేందుకు తమ శాఖ కృషి చేస్తుందన్నారు. అనంతరం కిశోరి వికాసంపై చక్కగా మాట్లాడిన బాలికలకు బహుమతులను అందజేశారు. సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ముగిసిన కిశోర బాలికల ఉత్సవాలు

ఉయ్యాలవాడ: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మే నెల 2వ తేదీ నుంచి జరుగుతున్న కిశోర బాలికల ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా మహిళా పోలీస్ సరస్వతి బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు సూచించారు. ఐదేళ్లలోపు చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


పోటాపోటీగా సాగుతున్న బండలాగుడు పోటీలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో మూల పెద్దమ్మ దేవర సందర్భంగా మంగళవారం నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. సీనియర్ విభాగానికి చెందిన ఎడ్ల పోటీల్లో పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి మొదటి బహుమతి కింద రూ.1.50 లక్షలు కై వసం చేసుకున్నాయి. అలాగే తాడిపత్రికి చెందిన రమేష్‌బాబు ఎడ్లు రెండో బహుమతి రూ.లక్ష, మైదుకూరుకు చెందిన నందీశ్వరావు ఎడ్లకు మూడో బహుమతి రూ.75వేలు, నంద్యాల జిల్లా హుసేనాపురానికి చెందిన రామసుబ్బారెడ్డికి చెందిన ఎడ్లు నాల్గవ బహుమతి రూ.50వేలు, హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎడ్లకు ఐదో బహుమతి రూ.40వేలను దాతలు విఖ్యాత్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, నందీశ్వరావు, రమేష్‌రెడ్డి, అఖిలాష్‌రెడ్డి, నాగేశ్వరరావు అందజేశారు.

జనని బ్యాంకు కేసులో మరొకరి అరెస్ట్

కోవెలకుంట్ల: ఎక్కువ వడ్డీ ఆశ చూపి ఖాతాదారులను మోసం చేసిన జననీ బ్యాంకు కేసులో మంగళవారం మరొకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం సోమవాండ్లపల్లెకు చెందిన ఆకుల వెంకటరమణ, కోవెలకుంట్లకు చెందిన గువ్వల పద్మావతి మరికొంత మందితో కలిసి నాలుగేళ్ల క్రితం పట్టణంలోని ఓంశాంతి భవన సమీపంలో జనని మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ పొదుపు, పరపతి సొసైటీని ఏర్పాటు చేశారు. సొసైటీలో డబ్బులు డిపాజిట్ చేస్తే మిగతా ప్రైవేట్ బ్యాంకులకంటే ఎక్కువ శాతం వడ్డీ ఇస్తామని, డిపాజిట్లపై రుణాలు తీసుకోవచ్చని నమ్మబలికించారు. వీరి మాటలు నమ్మి కోవెలకుంట్లతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఖాతాదారులుగా చేరి లక్షలాది రూపాయాలు డిపాజిట్లు చేశారు. ఈ సొమ్మును సంస్థ సీఈఓ వెంకటరమణ తన వ్యక్తిగత ఖాతాకు బదిలీ చేసుకుని స్వాహా చేశాడు. ఫిక్సుడ్ డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాదారుల బాండ్లకు గడవు తీరిపోవడంతో డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు సొసైటీ వద్దకు వెళ్లగా సంస్థయాజమన్యం బోర్డు తిప్పేయడంతో బాధితులు ఈ నెల 4వ తేదీ కోవెలకుంట్ల పోలీసులను ఆశ్రయించారు. ఐదుగురు ఖాతాదారులకు చెందిన రూ. 13.45 లక్షలు స్వాహా చేసినట్లు కేసు నమోదు చేశారు. నిందితులైన గువ్వల పద్మావతి, ఆకుల భరద్వాజ్‌ను ఇటీవల అరెస్ట్ చేయగా కేసులో నిందితురాలిగా ఉన్న బ్యాంకు అధ్యక్షురాలు సుజాతను అరెస్ట్ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ వివరించారు.